క్లుప్తంగా

కోదండరాంను కలిసిన నాయకులు



మహబూబాబాద్ అర్బన్: ప్రొఫెసర్ కోదండ రాంను కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీగా నియమించిన సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం ఆయనను తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షులు డాక్టర్ డోలి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందజేశారు.

నేషనల్ ఎడ్యుకేషన్ అవార్డుకు ఎంపిక



గార్ల: నేషనల్ ఎడ్యుకేషన్ అవార్డు-2024 కు గార్ల మండలం మద్రిగూడెం గ్రామానికి చెందిన అధ్యాపకుడు వల్లినాయక్ ఎంపికయ్యాడు. విద్యారంగంలో సామాజిక సేవలు చేసేవారిని ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు. మార్చి 31న ఢిల్లీలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు వల్లినాయక్ తెలిపాడు.

పురస్కారం ప్రదానం



మహబూబాబాద్ రూరల్: పట్టణానికి చెందిన కవి, రచయిత గుర్రపు సత్యనారాయణ పురస్కార అందుకున్నాడు. ఖమ్మం జిల్లా కేంద్రంలో అక్షరాల తోవ సాహితీ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయస్థాయి కవితల పోటీలు నిర్వహించారు. ఇందులో 'కల్తీ మనిషి' ఉత్తమ కవితగా ఎంపికైంది. కార్యక్రమంలో ప్రముఖ కవులు శ్రీనివాసరావు, సునంద పాల్గొన్నారు.

పట్టణ అధ్యక్షుడిగా ప్రసాద్



మహబూబాబాద్ రూరల్: సేవాలాల్ సేన కార్ యూనియన్ పట్టణ అధ్యక్షుడిగా బానోత్ ప్రసాద్‌ను నియమించినట్లు సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్న నాయక్, జిల్లా అధ్యక్షుడు గుగులోతు నందులాల్ ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కోర్ కమిటీ సభ్యులు ధరావత్ మోతిలాల్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాదావత్ రాంబాబునాయక్, జిల్లా అధికార ప్రతినిధి సురేష్ నాయక్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ కమిటీ ఎన్నిక


ప్రవీణ్‌కుమార్, అధ్యక్షుడు

కురవి: టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ ఆదివారం ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా ప్రసాద్, శైలజ, కోశాధికారిగా జయ, కార్యదర్శులుగా సురేష్, ప్రదీప్, రవీందర్, మాధవి, రామకృష్ణ, సురేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బాబు, సభ్యులుగా వీరభద్రం, అస్మత్‌పాషా, అకాడమిక్ కమిటీ కన్వీనర్‌గా శ్రీధర్, వీరన్న, జీఓల కమిటీ కన్వీనర్‌గా లక్ష్మయ్య, మల్లయ్య, మహిళా కమిటీ కన్వీనర్‌గా సంధ్యారాణి, తబితలను ఎన్నుకున్నారు.

కరుసుడే.. కరుసుడు

- గ్రామాల్లో వీధి కుక్కల స్వైరవిహారం..
- గాయాలపాలవుతున్న చిన్నారులు, పెద్దలు
- వాహనాల వెంటపడి తరుముతున్న గ్రామ సింహాలు
- ఎడ్జెర్లలో శునకాల దాడిలో ఓ వ్యక్తి మృతి


మరిపెడ పట్టణ కేంద్రంలోని రోడ్డుపై సంచరిస్తున్న శునకాల గుంపు

మరిపెడ రూరల్: వీధి కుక్కలు రోజురోజుకు రెచ్చిపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గుంపులు, గుంపులుగా వీధిల్లో సంచరిస్తూ నిత్యం ఏదో ఒక చోట చిన్నారులు, పెద్దలుపై దాడులు చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. సైకిల్, ద్విచక్రవాహనదారులను వెంటపడి తరుముతు పరుగులు పెట్టిస్తున్నాయి.

వీధుల్లోకి వెళ్లాలంటే భయమేస్తోంది..

రాత్రి వేళల్లో సంచరిస్తూ రోడ్లపై వెళ్లేవారిపై దాడులు తెగబడుతుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎన్ని సంఘటనలు చోటు చేసుకుంటున్న వీధి కుక్కల బెడదను నివారించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వీధుల్లోకి వెళ్లాలంటే భయం గుప్పెట్లో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల వీధి కుక్కల దాడుల్లో పలువురు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ప్రాణాలు పోతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పలువురు వాపోతున్నారు.


ఇటీవల శునకాల దాడిలో గాయపడిన చిన్నారి (ఫైల్)

వీధి కుక్కలను నియంత్రించాలి



గ్రామాల్లో వీధి కుక్కల నియంత్రణ లేకపోవడంతో విపరీతంగా పెరిగిపోయాయి. వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను కరుస్తున్నాయి. వాహనల వెంట పడి మరీ తరుముతున్నాయి. వీధిలోకి రావాలంటే ప్రజలు జనుకుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి గ్రామాల్లో విచ్చల విడిగా సంచరిస్తున్న వీధి కుక్కలను నియంత్రించాలి

- గాదగాని వెంకన్న, ఆటోడ్రైవర్, నీలికుర్తి

పలువురికి గాయాలు

ఇటీవల జిల్లాలలోని చిన్నగూడూరు మండలం విస్సంపల్లి గ్రామంలో ఒకే గ్రామంలో ముగ్గురి వ్యక్తులపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. అదే విధంగా మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామంలో ఓ వ్యక్తిని కుక్క దాడి చేయగా చికిత్స పొందుతు మృతి చెందాడు. స్టేజితండాలో పలువురి చిన్నారులపై వీధికుక్కలు దాడి చేసి ముఖం, కాళ్లు, చేతులపై గాయాలు చేశాయి. మూగ జీవాలను సైతం వదలకుండా కరిచేస్తున్నాయి. గ్రామాల్లో వీధి కుక్కల సమస్య తీవ్రం అవుతున్నప్పటికీ సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి వీధి కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏడునెలలుగా అందని వేతనాలు


రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు ఏడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో ఆర్థిక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండుగల వేళ అప్పులు చేస్తూ కుటుంబ పోషణ కోసం అవస్థలు పడుతున్నారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో 27 మంది పారిశుద్ధ్య కార్మికులు, నలుగురు పంప్ ఆపరేటర్లు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, ఇద్దరు ఎలక్ట్రీషియన్లు, నైట్ వాచ్‌మెన్‌తో కలిపి 41 మంది కార్మికులు ఉన్నారు. వీరికి నెలనెలా సుమారు రూ.8లక్షల నుంచి రూ.8.5లక్షల వరకు జనరల్ ఫండ్ నుంచి వేతనాలు చెల్లించాల్సి ఉంది. పన్నులు సక్రమంగా వసూలు కాకపోవడంతో కార్మికులకు సకాలంలో వేతనాలు అందడం లేదు. జనరల్ ఫండ్‌లో జమ అవుతున్న నిధులను ఇతర పనులకు కేటాయిస్తూ తమ వేతనాలను పట్టించుకోవడం లేదని కార్మికులు వాపోతున్నారు. మురుగు, చెత్తలో నిత్యం మగ్గుతూ తెల్లవారుజాము నుంచే పట్టణాన్ని శుభ్రం చేసే పనుల్లో నిమగ్నమవుతున్న కార్మికులకు నెలనెలా వేతనాలివ్వడంలో మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యం వహించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జనరల్ ఫండ్‌లో నిధులు లేకపోవడంతో వేతనాలివ్వలేకపోతున్నామని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. ఏడు నెలలుగా వేతనాలందకపోవడంతో మరోనాలుగు రోజుల్లో తాము ప్రత్యక్ష ఆందోళన చేపడుతున్నట్లు కార్మికులు చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కార్మికులకు వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తొర్రూరు రూరల్: మండలంలోని చెర్లపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మహంకాళి బుచ్చయ్య, పూర్వ విద్యార్థులు నాగయ్య, యాకయ్య, శ్రీనివాస్, యాకుబ్‌పాషా పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి


రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

మహబూబాబాద్ అర్బన్: జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని క్రీడాకారులను 13వ వార్డు కౌన్సిలర్ దండబోయిన వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం సాఫ్ట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించగా వార్డు కౌన్సిలర్ దండబోయిన వెంకన్న హాజరై క్రీడాకారులను ముందుగా పరిచయం చేసుకున్నారు. 16మంది బాలుర జట్టుకు, 16మంది బాలికల జట్టుకు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 3, 4 తేదీలో మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని, బాలుర జట్టు ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో హనుమకొండ జిల్లా ధర్మాసాగర్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మెట ప్రేమ్‌కుమార్ తెలిపాడు. కార్యక్రమంలో బేస్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి ప్రభాకర్, క్రీడాకారులు ప్రవీణ్ కుమార్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సెంట్రింగ్ పనుల రేట్లు పెంచాలి

డోర్నకల్: నిర్మాణ రంగంలో అన్నిరకాల వస్తువులతోపాటు కూలీల రేట్లు పెరగడంతో సెంట్రింగ్ పనుల రేట్లు పెంచాలని సెంట్రింగ్ మేస్త్రీల యూనియన్ పట్టణ అధ్యక్షుడు తాడూరి వీరాచారి డిమాండ్ చేశాడు. స్థానిక అశోక్‌భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూలి రేట్లు, రా మెటీరియల్ రేట్లు పెరగడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సెంట్రింగ్ రాడ్ బెండింగ్‌తో కలిపి ఫీటుకు రూ.75చొప్పున పెంచాలని నిర్ణయించినట్లు తెలిపాడు. పెంచిన రేట్లకు అనుగుణంగా సుతారి మేస్త్రీలు తమకు సహకరించాలని లేనిచో పనులు నిలిపివేస్తామని తెలిపారు. సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి కోటోజు నరేష్, ఉపాధ్యక్షులు వెంకటనారాయణ, నాయకులు ఉమేష్, నాగరాజు, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నెల్లికుదురు: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో వీరపురం యాకయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఉప సర్పంచ్ కాసం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి ఆదివారం 50కిలోల బియ్యతోపాటు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సుమలత మురళి, బాబురావు, రాగయ్య పాల్గొన్నారు.

మున్నూరుకాపులు అన్నిరంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న చందా గోపి

కేసముద్రం: మున్నూరు కాపులు అన్నిరంగాల్లో రాణించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి, మండల మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు చందాగోపి అన్నారు. ఆదివారం మండలంలోని అమీనాపురం గ్రామంలోని ఎంకే కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో సంఘం 21వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మున్నూరుకాపులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. వరంగల్ జిల్లాలో సంఘ సభ్యుల ఆర్థిక తోడ్పాటుతో పెద్ద ఫంక్షన్ హాల్ నిర్మాణం చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు వద్దిరాజు దేవేందర్, ప్రధాన కార్యదర్శి కముటం స్వామి, కోశాధికారి సింగంశెట్టి ఏకాంతం, మురళి, ప్రవీణ్‌కుమార్, గని యాదగిరి, శ్రీకాంత్, సుందర్ వెంకన్న పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడం అదృష్టం


వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న విజయకాంత్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్: తనకు జన్మనిచ్చిన గ్రామంలోని ప్రజలకు సేవ చేసే అవకాశం రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని బిగ్ టీవీ చైర్మన్, ఎస్ఆర్‌బి వెన్నం విజయకాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని రెడ్యాల గ్రామ ప్రజల సౌకర్యార్థం వెన్నం సరోజదేవి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు విజయకాంత్ రెడ్డి ఆదివారం రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన సురక్షిత మంచినీటి కేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశాడు. కార్యక్రమంలో శిల్ప, యువాన్, అన్విత్, రెడ్యాల గ్రామ సర్పంచ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, బిందు, సహస్ర, గీతిక, శ్రీలేఖ, భాస్కర్ రెడ్డి, మా అసోసిషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం, నాయకులు చాంద్ పాషా, మాధవపెద్ది అమరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ స్థానం ఎరుకలకు కేటాయించాలి


మాట్లాడుతున్న సాంబయ్య

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పార్లమెంటు స్థానాన్ని ఎరుకుల కులానికి కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ గిరిజన నాయకులు రాయపురం సాంబయ్య కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సాంబయ్య మాట్లాడుతూ.. ఎస్టీ సామాజిక వర్గంలోని ఉపకులాలైన గోర్ లంబాడీలు, కోయనుంచి అనేక మందికి ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో తనకు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని కోరాడు. సమావేశంలో మొగిలి నాగన్న, రామచంద్రు, రామకృష్ణ, రామ్మోహన్, రాగం లాజర్, నరసయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దాసరి స్రవంతి అశోక్ కుమార్ సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ట్రెజరర్ నర్సయ్య, కటకం చంద్రశేఖర్, యర్నం శ్రీరాములు, మారం సమ్మిరెడ్డి, చింత కరుణాకర్, ప్రభాకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధంకావాలి

మహబూబాబాద్ రూరల్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అన్నారు. మిత్ర వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మిత్ర వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గంధసిరి ఉప్పలయ్య, హరికృష్ణరెడ్డి, కటికరెడ్డి శ్రీనివాస్, సంక బద్రినారాయణ, కీసర పద్మాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వాసుదేవ్ పాల్గొన్నారు.

వర్గీకరణకు చర్య తీసుకోవాలి

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం కమిటీ పేరా కాలయాపన చేయకుండా వర్గీకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ్ర ఎల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణపై బీజేపీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర క్యాబినేట్ విస్తరణలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సందీప్, శ్రీను, రాధా, ఎల్లేందర్ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



మహబూబాబాద్ రూరల్: మహిళా సాధికారతే సమాజాభివృద్ధి అని కాంగ్రెస్ నాయకుడు శంతన్ రామరాజు అన్నారు. తన జన్మదినం సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించి, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశాడు. కార్యక్రమంలో చిట్టిబాబు, రాజు, వీరన్న, రాందాసు, సాగర్, రామరాజు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గార్ల: తెలంగాణ భవన నిర్మాణ రంగ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో గార్లలో కార్మికులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు, మేస్త్రీలు జడ శ్రీను, సావిటి వీరయ్య, మౌలాన, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ ఫలితమే బీసీ గణన

బయ్యారం: బీసీ కులగణన కోసం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు ఉద్యమాల ఫలితంగానే నేడు రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసేందుకు ముందుకు వస్తుందని సంఘం రాష్ట్ర నాయకులు కొత్త వినయ్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు సురేష్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించాలి

బయ్యారం: గ్రామపంచాయతీల్లో సర్పంచులను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించి కొత్త పాలకవర్గాలు ఏర్పడే వరకు పాలన కొనసాగించాలని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పోలెబోయిన వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం బయ్యారంలో విలేకరులతో మాట్లాడారు. పంచాయతీల్లో పేరుకపోయిన నిధులను విడుదల చేయాలన్నారు.

క్రమబద్ధీకరించాలి

కురవి: మండల కేంద్రం శివారులో ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను క్రమబద్ధీకరించి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశాడు. ఆదివారం గుడిసెవాసులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కర్లం రాజన్న, నాయకులు కన్నె వెంకన్న, బుర్ర సమ్మయ్య పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి

కురవి: పెండింగ్ స్కాలర్‌షిప్స్, రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ మరిపెడ డివిజన్ కార్యదర్శి గంధసిరి జ్యోతిబసు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 29వ తేదీన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు వీరేందర్, మహేష్, నవీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

మరిపెడ రూరల్: రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందాల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని గుండెపుడి గ్రామంలో రైతు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఇమామ్‌సాబ్, ఉప్పలయ్య, సురేష్, వీరన్న పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ కమిటీ ఎన్నిక

కేసముద్రం: మండల కేంద్రంలోని శ్రీరామమందిరంలో విశ్వహిందూ పరిషత్ మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అయోధ్య రామోత్సవ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించి, నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బాణాల నాగరాజు, ప్రధాన కార్యదర్శి తాడూరి ఉమేష్, కోశాధికారి అల్లం నిరంజన్, సహాయ కార్యదర్శులుగా శ్రీరామ్ సంతోష్, బానోత్ మోహన్, సందీప్, వీరన్న, బాల్ మోహన్, గాదె శ్రీనివాస్, దేవేందర్, మహేందర్, పరకాల కుమార్, మహేశ్వరం, వేణుమాదవ్, జనార్ధన్‌రెడ్డి, హరిదాస్ వేణు, రాము, భాస్కర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

సొసైటీకి చేరుకున్న యూరియా



సాక్షి ఎఫెక్ట్..

కురవి: సీరోలు మండలం కాంపల్లి రైతు సహకార సంఘానికి (సొసైటీ) ఆదివారం 445 బస్తాల యూరియా చేరుకుంది. ఈనెల 26వ తేదీన కాంపల్లికి చెందిన రైతులు యూరియా కావాలని సొసైటీ ఎదుట ధర్నా నిర్వహించగా 27న సాక్షిలో 'యూరియా కోసం రైతుల ధర్నా' అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి విధితమే. ఈమేరకు కురవి మండల వ్యవసాయశాఖ అధికారి మంజుఖాన్ ఆదివారం యూరియాను తెప్పించారు. సొసైటీ కార్యాలయానికి వచ్చిన యూరియాను తీసుకుని సొసైటీకి అప్పగించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ శ్రీమాన్, మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బానోత్ రవి, రైతు కొప్పుల వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఎట్టకేలకు యూరియా సొసైటీకి రావడంతో కాంపల్లి రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

'పది'లో ఏడు పేపర్లు

- సైన్స్ సబెక్టులకు వేర్వేరుగా పరీక్షలు
- మిగతా సబ్జెక్టులకు మాత్రం రోజుకొక్కటి
- విద్యార్థులపై తగ్గనున్న ఒత్తిడి


చదువుకుంటున్న విద్యార్థులు

పెద్దవంగర: మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. అయితే ప్రభుత్వం ఈ ఏడాది పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసింది. కరోనా కాలం అనంతరం పదో తరగతిలో పరీక్షలు రోజుకొక్కటి చొప్పున నిర్వహిస్తుండగా ఈ విద్యా సంవత్సరం ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలను రెండు వేర్వేరు రోజుల్లో నిర్వహించనుంది. సైన్స్ రెండు విభాగాలు చేసి 50 మార్కుల చొప్పున రెండు రోజులు నిర్వహించనుంది. మిగత సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలను యథావిధిగా 100మార్కులతో నిర్వహించనున్నారు. దీంతో విద్యార్థులపై కొంత ఒత్తిడి తగ్గిపోతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

రెండేళ్లుగా ఒకే పరీక్ష..

కరోనా కాలం అనంతరం రెండేళ్లుగా సైన్స్ పరీక్షను ఒకే రోజు ఒకదాని తర్వాత ఒకటి నిర్వహించేవారు. దీంతో విద్యార్థులు కొంత మానసిక ఆందోళనకు గురయ్యేవారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల వినతుల మేరకు బయోలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులను వేర్వేరుగా నిర్వహించేందుకు విద్యాశాఖ సుముఖత చూపింది. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సాంఘిక, గణిత శాస్త్రాలను ఒక్కొక్క ఉపాధ్యాయుడు బోధిస్తున్నారు. కాగా ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌ను మాత్రం వేర్వేరుగా ఉపాధ్యాయులు ఇద్దరు బోధిస్తున్నారు. దీంతో పరీక్షలు కూడా వేర్వేరుగా నిర్వహించాలనే వినతుల మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది.

టైం టేబుల్

18-03-2024- తెలుగు
19-03-2024- హిందీ
21-03-2024- ఆంగ్లం
23-03-2024- గణితం
26-03-2024- భౌతికశాస్త్రం
28-03-2024- జీవశాస్త్రం
30-03-2024- సాంఘికశాస్త్రం


ఎక్కువ మార్కులకు దోహదం



పదో తరగతిలో సైన్స్ సబ్జెక్టుకు సంబంధించిన పరీక్షలను వేర్వేరు రోజుల్లో నిర్వహించడం వలన ఎక్కువ మార్కులు సాధించేందుకు అవకాశం ఉంది. విద్యార్థులు రోజుకు ఒక్క పరీక్ష నిర్వహించినట్లైతే ప్రశాంతంగా పరీక్షలు రాసే వీలుంటుంది. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పది గ్రేడ్ పాయింట్లు ఎక్కువ మంది సాధించేలా ప్రత్యేక చొరవ చూపుతున్నాం.

- హైమ, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు

వేర్వేరుగా నిర్వహించడం హర్షణీయం



భౌతిక, రసాయన జీవశాస్త్ర పరీక్షలను వేర్వేరు రోజుల్లో నిర్వహించడం హర్షణీయం. ఈవిధానంతో విద్యార్థులకు కాలం వెసులుబాటు కలుగుతుంది. ఒత్తిడి లేకుండా విద్యార్థులు పరీక్షలు రాస్తారు. విద్యాశాఖ పదో తరగతి టైం టేబుల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

- బుధారపు శ్రీనివాస్, నోడల్ హెచ్ఎం, పెద్దవంగర

సర్పంచ్ కృషి అభినందనీయం



గార్ల: 5ఏళ్ల పాలనలో గార్ల మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధిలో సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ కీలక భూమిక పోషించారని జెడ్పీటీసీ సభ్యురాలు జాటోత్ ఝాన్సీలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వీడ్కోలు సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రెండుసార్లు సర్పంచ్‌గా పనిచేసిన బన్సీలాల్‌ను పంచాయతీ సిబ్బందితో పాటు, నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ కుమారస్వామి, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, ఎంపీడీఓ రవీందర్, ఎస్సై జీనత్‌కుమార్, ఉపసర్పంచ్ కందునూరి మహేశ్వరరావు, శ్రీనుగౌడ్, శ్రీనివాసరావు, రామారావు, కృష్ణగౌడ్, సక్రు, వీరన్న పాల్గొన్నారు.